క్లుప్తంగా

రిజిస్ట్రార్‌ను అభినందించిన యార్లగడ్డ



ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు పుస్తకాన్ని బహూకరిస్తున్న రిజిస్ట్రార్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను మాజీ రాజ్యసభ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అభినందించారు. శనివారం రిజిస్ట్రార్‌ను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల అంబేడ్కర్ విజన్‌పై పుస్తకాన్ని రచించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ రిజిస్ట్రార్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య లక్ష్మీప్రసాద్‌కు అంబేడ్కర్ విజన్ పుస్తకాన్ని రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్ అందజేశారు.

స్వయం ఉపాధితో ఆర్థిక పురోగతి



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

మద్దిలపాలెం : స్వయం ఉపాధితో ఆర్థిక పురోగతి సాధించాలని జన శిక్షాన్ సంస్థాన్ చైర్మన్ సీఏ రామరాజు అన్నారు. మద్దిలపాలెం జన శిక్షాన్ సంస్థాన్‌లో టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 39 మందికి శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. స్వయం ఉపాధికి దోహదపడే టైలరింగ్ వృత్తిలో రాణించాలని ఆయన సూచించారు. అనంతరం శిక్షణ పొందిన వారితో ప్రాంగణంలో స్వచ్ఛత ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అప్పలనాయుడు, ధాన్ ఫౌండేషన్ ప్రతినిధి రామచంద్ర శేఖర్, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు, కె.ఎల్.మనోహరరావు పాల్గొన్నారు.

కారు ఢీకొట్టడంతో విరిగిన విద్యుత్ స్తంభం



విరిగిన విద్యుత్ స్తంభం

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో మితిమీరిన వేగంతో ప్రయాణించిన ఓ కారు ప్రమాదానికి గురైంది. డివైడర్, విద్యుత్ స్తంభాన్ని ఢీకొని నుజ్జయింది. దీని తాకిడికి విద్యుత్ స్తంభం సైతం విరిగిపోయింది. శుక్రవారం రాత్రి హనుమంతవాక నుంచి సింహాచలం వైపు సెంట్రల్ రోడ్డులో కారు మితిమీరిన వేగంతో వెళుతోంది. బీఆర్‌టీఎస్ రోడ్డులో జీవీఎంసీ 13వ వార్డు పరిధి దారపాలెం దాటిన తర్వాత అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో డివైడర్ పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడం విరిగిపోయింది. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జయింది.

సచివాలయ కన్వీనర్లకు అవగాహన

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులో సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో శనివారం సమావేశం జరిగింది. వార్డు పరిధి బాలాజీనగర్ షాదీఖానాలో జరిగిన ఈ కార్యక్రమంలో తూర్పు నియోకవర్గం ఎన్నికల పరిశీలకుడు బాబిరెడ్డి, విశాఖ యూత్ అధ్యక్షుడు ఆళ్ల గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ హాజరయ్యారు. త్వరలో జరగనున్న 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమంపై వీరికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో జర్నల్స్



కంప్యూటర్‌లో జర్నల్స్ వివరాలు

- సోల్ 3.0 సాఫ్ట్‌వేర్ వినియోగంతో సత్వర సేవలు
- పరిశోధకులకు ఉపయుక్తంగా రూపకల్పన



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు, పరిశోధకులు



జర్నల్స్‌ను పరిశీలిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఏయూక్యాంపస్: సాంకేతికతను ఉపయుక్తంగా నిలుపుకుంటూ పరిశోధకులకు సత్వర సేవలు అందించే విధంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం గ్రంథాలయం పనిచేస్తోంది. ఇటీవల ఏయూ నూతనంగా తీసుకువచ్చిన సోల్ 3.0 సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి శాస్త్రీయ జర్నల్స్‌ను ఒక్క క్లిక్‌తో పరిశోధకులు పొందే విధంగా తీర్చిదిద్దారు. గతంలో ఉపయోగించిన మాన్యువల్ విధానానికి స్వస్తి పలుకుతూ వేగవంతమైన సేవలు అందించే దిశగా సిబ్బంది పనిచేస్తున్నారు. నూతన విధానంలో పరిశోధకులు తమకు అవసరమైన విభిన్న జర్నల్స్‌ను కేవలం ఒక క్లిక్‌తో పొందే వెసులుబాటు ఏర్పడింది.

ఆటోమేషన్‌తో ముందడుగు..

మారుతున్న కాలానికి అనుగుణంగా డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయం తమ సిబ్బందిని అధునాతన సాంకేతికతను వినియోగించే విధంగా ప్రోత్సహిస్తోంది. గ్రంథాలయాలకు ఉపయుక్తంగా నిలిచే సోల్ 3.0 సాఫ్ట్‌వేర్‌ను ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనిని పూర్తి స్థాయిలో వినియోగిస్తూ దశాబ్దాలుగా ఆచరణలో ఉన్న మాన్యువల్ విధానానికి స్వస్తి చెప్పింది.

మాన్యువల్ నుంచి ఆటోమేషన్ దిశగా..

గతంలో పరిశోధన జర్నల్స్ అవసరమైతే టైటిల్, పబ్లిషర్ వివరాలు ఆధారంగా వెతికేవారు. దీనికి కార్డెక్స్ మాన్యువల్ విధానంగా పిలిచే వారు. ఒక్కో సబ్జెక్టుకు సంబంధించిన జర్నల్‌ను గుర్తించడానికి విద్యార్థికి గంటకు పైగా సమయం పట్టేది. నేడు దీనికి పూర్తిస్థాయిలో ఆటోమేషన్ చేసి విద్యార్థి కోరిన సమాచారాన్ని కేవలం ఒక సెకను వ్యవధిలో ఇచ్చే వెలుసుబాటు ఏర్పడింది. ఒక సబ్జెక్టుకు సంబంధించిన అనేక జర్నల్స్‌ను ఏకకాలంలో పొందే అవకాశం కలిగింది. ముఖ్యంగా పరిశోధకులకు ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోంది. ఒక ప్రత్యేకమైన అంశంపై విభిన్న జర్నల్స్‌ను ముద్రితమైన పరిశోధన పత్రాలను ఏకకాలంలో పొంది, వైవిధ్యమైన జ్ఞానాన్ని పొందడానికి మార్గం సుగమం అవుతోంది.

ప్రింట్, ఈ–జర్నల్స్

ప్రస్తుతం ఆంధ్రవిశ్వవిద్యాలయం గ్రంథాలయంలో 17 వేల వరకు జర్నల్స్ అందుబాటులో ఉన్నాయి. కొన్ని పుస్తక రూపంలో ఉండగా, మరి కొన్ని ఈ–జర్నల్స్ రూపంలో అందుబాటులో ఉంచారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ముద్రించిన జర్నల్స్ సైతం ఇక్కడ గ్రంథాలయంలో ఉన్నాయి. విభాగాధిపతులు తమ విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయుక్తంగా నిలిచే జర్నల్స్‌ను సూచిస్తూ గ్రంథాలయానికి లేఖ రాస్తారు. వీటి ఆధారంగా చేసుకుని గ్రంథాలయాధికారి సంబంధిత జర్నల్స్‌ను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతారు. ప్రధాన గ్రంథాలయంలో ఉన్న జర్నల్స్‌కు అదనంగా ఇంజినీరింగ్ కళాశాలలో మరికొన్ని ఈ–జర్నల్స్ సైతం అందుబాటులో ఉంచుతున్నారు.

సాంకేతిక ప్రగతిని తెలుసుకునే విధంగా..



ప్రపంచ వ్యాప్తంగా శాస్త్ర విజ్ఞానంలో నూతన ఆవిష్కరణలు, ప్రగతిని తెలిపేవిగా జర్నల్స్ నిలుస్తాయి. విద్యార్థులు, పరిశోధకులు తమ శాస్త్ర సంబంధంగా జరుగుతున్న నూతన పరిశోధనల వివరాలు తెలుసుకోవడానికి జర్నల్స్‌ను అందుబాటులో ఉంచడం జరుగుతోంది. దీని కోసం ప్రత్యేకంగా ఒక విభాగం పనిచేస్తోంది. విద్యార్థులకు మరింత సమర్థ సేవలు అందించే ప్రక్రియలో భాగంగా ఏయూ వీసీ సూచనలతో వీటిని ఆటోమేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు.

–ఆచార్య పి.వెంకటేశ్వర్లు, గ్రంథాలయాధికారి

ప్రజలకు వరం..'ఆరోగ్య సురక్ష'



వైద్య శిబిరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య



వైద్య శిబిరంలో పేర్లు నమోదు



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రెనిషా

మద్దిలపాలెం : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య అన్నారు. పాత వెంకోజీపాలెంలో అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలో సింహాద్రిపురం సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు ప్రజారోగ్యానికి బాటలు వేస్తున్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వార్డులో అన్ని సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం డాక్టర్ రెనిషా మాట్లాడుతూ వైద్య శిబిరంలో 503 మందికి పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందించామన్నారు. మెరుగైన వైద్యం కోసం ఐదుగుర్ని కేజీహెచ్‌కు తరలించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్టు వైద్యులు ఐదుగురు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ రఘునాథ్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్ , అడ్మిన్ రమేష్, వెంకటలక్ష్మి, త్రినాథరావు, రాజారావు, అచ్చుత పాల్గొన్నారు.

డాక్టర్ రఫీ మహ్మద్‌కు జాతీయ అవార్డు



అవార్డుతో రఫీ మహ్మద్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీకి చెందిన డాక్టర్ రఫీ మహ్మద్‌కు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు లభించింది. ప్రస్తుతం ఎన్ఐటీ ఏపీలో మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టర్ రఫీ మహ్మద్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. ఇటీవల ఆయన డిస్టింక్షన్ ఇన్ కొరోషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవార్డును అందుకున్నారు. అసోసియేషన్ ఫర్ మెటీరియల్స్, పెర్మార్మెన్స్ అండ్ ప్రొటెక్షన్ (ఏఎంపీపీ) ఇండియా ద్వారా సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ఈ అవార్డును డాక్టర్ రఫీ మహ్మద్‌కు అందజేసింది. పరిశోధన రంగంలో గణనీయమైన కృషి, పీర్ రివ్యూడ్ ఇంటర్నేషనల్ జర్నల్‌లో 25కు పైగా పరిశోధన కథనాలు ప్రచురణ, అంతర్జాతీయ సదస్సుల్లో 50కు పైగా పరిశోధన పత్రాలు సమర్పణ వంటి సేవలకు గుర్తింపుగా ఏఎంపీపీ డాక్టర్ రఫీ మహ్మద్‌ను ఈ అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, విద్యావేత్తలు ఆయనను అభినందించారు.

తెలుగు రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులు కావాలి



మాట్లాడుతున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.పాల్

సీతమ్మధార : తెలుగు రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులు కావాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ. పాల్ అన్నారు. శనివారం ఆశీలమెట్టలో గల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పలు బీసీ సంఘాలు తమ పార్టీకి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నాలుగు లక్షల మంది క్రైస్తవ ఓటర్లు ఉన్నారని, ఐదు వేల చర్చిలు ఉన్నాయన్నారు. తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్, పలువురు మహిళలను పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో నవంబర్ 9వ తేదీన 10 గంటలకు బీసీ మహాసభ జరుగుతుందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల బీసీ సంఘాలు పాల్గొంటాయని తెలిపారు. తాను వచ్చే ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేస్తానన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తానే అడ్డుకున్నానన్నారు. తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్, బీసీ నాయకులు ఎస్.ఎ.రమణ, ఎస్‌సీ అప్పారావు, పలువురు మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీ కండువాలు కప్పారు.

23వ వార్డులో అన్నదానం



అన్నదానంలో వడ్డన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత సత్యారెడ్డి

మద్దిలపాలెం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం జీవీఎంసీ 23వ వార్డులో మద్దిలపాలెం రాజ రాజేశ్వరి కనకదుర్గ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ 23వ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ 20 బస్తాల బియ్యం అన్నదానికి వితరణ చేశారన్నారు.ఈ కార్యక్రమంలో ఆటో స్టాండ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగరతీరంలో విజిలెన్స్ వాక్‌థాన్



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న స్వామి వేద్యానంద స్వామీజీ, బ్యాంకు జీఎం సీవీఎన్ భాస్కరరావు

బీచ్‌రోడ్డు: విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్కేబీచ్‌లో విజిలెన్స్ వాకథాన్‌ను నిర్వహించారు. ఈ వాకథాన్‌ను, ఆర్కే మిషన్ స్వామి వేద్యానంద స్వామీజీ, బ్యాంకు జీఎం సీవీఎన్ భాస్కరరావు బెలున్లు విడిచిపెట్టి ప్రారంభించారు. అనంతరం ఉద్యోగుల చేత అవినీతి నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. అవినీతి రహిత భారతదేశాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఏజీఎం నటరాజ్, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'అల్లరి పిల్ల'



అల్లరి పిల్ల నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: హైదరాబాద్‌కు చెందిన అగాఖాన్ అకాడమీ థియేటర్ సర్కిల్ నిర్వహణలో నంది అవార్డు గ్రహీత, రంగస్థల నటుడు డాక్టర్ ఇండ్ల చంద్రశేఖర్ రచన, దర్శకత్వంలో అల్లరిపిల్ల నాటికను అద్భుతంగా ప్రదర్శించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నాటికను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, వీఎండీఏ ప్రతినిధి ఎం.ఎస్.ఎన్.రాజు ప్రారంభించారు. నాటి తరానికి నేటి తరానికి మధ్య వచ్చిన వ్యత్యాసాన్ని చక్కని సినిమాటిక్‌గా నాటికను ప్రదర్శించారు. ఆనాటి ఆటపాటాలతో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఎంతో గొప్ప చూపిస్తూనే నేటి తరానికి ఆనాటి మధుర్యాన్ని అందించే ప్రయత్నం చేశారు. ఈ ప్రదర్శనలో నటీనటులంతా యువతీయువకులే కావడంతో విశేషం.

ఏఎస్‌ఐపై దాడి చేసిన పది మందిపై కేసు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ ఏఎస్‌ఐపై దాడికి పాల్పడిన పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకృష్ణానగర్ తొండం వినాయకుడి గుడి వద్ద దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి విగ్రహం అనుపు కార్యక్రమంలో భాగంగా డీజే సౌండ్స్ ఎక్కువగా రావడంతో స్థానికులు డయల్ 112కు కాల్ చేశారు. నైట్ రౌండ్స్‌లో ఉన్న ఫోర్త్‌టౌన్ ఏఎస్‌ఐ శివకృష్ణ అక్కడికి వెళ్లి నిర్వాహకులకు సౌండ్ తగ్గించాలని చెప్పారు. వారిలో మద్యం తాగిన మత్తులో ఉన్న కొంత మంది ఏఎస్‌ఐ విధులకు ఆటంకం కలిగించారు. వెంకటసూర్యనారాయణతో కలిసి పది మంది ఆయనపై దాడి చేశారు. స్టేషన్ అధికారి విజయకుమార్‌కు కాల్ చేసి విషయం చెప్పడంతో.. ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో కొంత మంది యువకులు పారిపోయారు. రంగంలోకి దిగిన పోలీసులు పది మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

13వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



విష్ణుపురి కాలనీలో మహిళ కరపత్రం అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: ప్రజలకు ఉత్తమమైన పాలన అదించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి దుర్గాబజార్, విష్ణుపురికాలనీలలో పర్యటించారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వల్ల ఏవిధమైన లబ్ధి చేకూరిందో అడిగి తెలుసుకొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు కోసం దరఖాస్తులు చేయించాలని సచివాలయాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, శిరీష, ఆర్.ఎస్ నాయుడు, విమల, పోలరావు, పద్మారాణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ప్రాముఖ్యతను వివరిస్తూ పెయింటింగ్స్



పెయింటింగ్ కళాకారులతో కరణ్ మేడప్ప

బీచ్‌రోడ్డు: నీటి సంరక్షణ, సుస్థిరత ప్రాముఖ్యతను వివరిస్తూ దేశంలోని 25 మంది కళాకారులతో వారం రోజు పాటు పెయింటింగ్స్ వేయడం జరుగుతుందని విశ్వ సముద్ర గ్రూప్ ప్రెసిడెంట్ కరణ్ మేడప్ప తెలిపారు. బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో పెయింటింగ్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 3వ తేదీన విశాఖలో జరగబోయే ఐసీఐడీ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ సందర్భంగా భారతీయ ప్రదర్శనలు, దృశ్య కళలను ప్రోత్సహించేందుకు ఈ పెయింటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పెయింటింగ్ ప్రదర్శనలో విశాఖకు చెందిన ఐదుగురు కళాకారులతో పాటు దేశంలోని ప్రసిద్ధి చెందిన 20 మంది కళాకారులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెహర్ సంస్థ వ్యవస్థాపకుడు సంజీవ్, కళాకారులు పాల్గొన్నారు.

విద్యా సమాచారమ్

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న రిజిస్ట్రార్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినరింగ్ కళాశాల విద్యార్థులను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అభినందించారు. త్వరలో నాక్ కమిటీ ఏయూను సందర్శిస్తున్న నేపథ్యంలో వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం రిజిస్ట్రార్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. శనివారం ఇంజినీరింగ్ కళాశాలలో పనులను పర్యవేక్షిస్తున్న సమయంలో కళాశాల ఆవరణలో ఉన్న పలు చెట్లకు ఏయూ ఎన్‌సీసీ విద్యార్థులు రంగులు వేస్తూ కనిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. రిజిస్ట్రార్ వెంట ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు, డాక్టర్ యుగంధర్ పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్ శిక్షణకు ఏయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిధిలోని జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్) నుంచి ఐదుగురు వలంటీర్లు ఎంపికయ్యారు. వీరిని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఏయూ అనుబంధ కళాశాలకు చెందిన అశ్రీన మీర్జా మహమ్మద్, కె.రచన, కె.కేథ శ్రీ, పి.హేమలత, ఎస్.కల్యాణిలు నవంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కేఎల్ యూనివర్సిటీలో జరిగే ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొంటారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా జరిగే ఇటువంటి కార్యక్రమాలకు ఏయూ విద్యార్థులు ఎంపిక కావడంపై వీసీ సంతోషం వ్యక్తం చేసి విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య పార్థసారధి వర్మ, ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను కలిసిన మంత్రి నాగార్జున

ఏయూక్యాంపస్ : రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున శనివారం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో మాజీ రాజ్యసభ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆచార్య లక్ష్మీ ప్రసాద్‌సేవలు రాష్ట్ర సాహితీ, సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడతాయని మంత్రి అన్నారు.

వైభవంగా లలితాదేవి తిరువీధి మహోత్సవం



అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ఏయూక్యాంపస్: శ్రీ లలితా సుందరేశ్వర పీఠంలో దసరా ఉత్సవాలలో భాగంగా చివరిరోజున అమ్మవారికి తిరువీధి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో శ్రీచక్రనవావరణ అర్చన, చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచామృత అభిషేకం, విశేష పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి తరువీధి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వయంగా పాల్గొని అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. మంగళవాయిద్యాలతో, కోలాటం బృందం శాస్త్రీయ నృత్యాలతో అమ్మవారి ఊరేగింపు వైభవోపేతంగా సాగింది. భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. నేటితో అమ్మవారి ఉత్సవాలను ముగించినట్లు ఆలయ ప్రధాన పురోహితులు కాండూరి లక్ష్మణ స్వామి తెలిపారు. తీరువీధి ఉత్సవంలో పీఠం ట్రస్టీ డాక్టర్ చిట్టి పంతులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఆలయాలు మూత....

చంద్రగ్రహణం నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఆలయాలను మూసివేశారు. రాహుగ్రస్త చంద్రగ్రహణం శనివారం రాత్రి 1.04 నుంచి 2.22 గంటల వరకు ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆలయాలను మూసివేసి, ఆదివారం ఉదయం గ్రహణం అనంతరం ఆలయాలు సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు.

'నా మట్టి నా దేశం' కార్యక్రమానికి విశాఖ యువత



ఢిల్లీ వెళుతున్న యువతీ యువకులు

బీచ్‌రోడ్డు: కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో ఈ నెల 30, 31 తేదీలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నా మట్టి నా దేశం కార్యక్రమానికి విశాఖ యువత హాజరుకానుంది. ఈ మేరకు నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో శనివారం 40 మంది యువత బస్సులో బయలుదేరి వెళ్లారు. ఈ బస్సును ప్రారంభించిన నెహ్రూ యువ కేంద్ర అధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా సేకరించిన మట్టితో అజాదీ కా అమృత్ మహోత్సవ్ చిహ్నం స్థూపం నిర్మించనున్నారు.